## 24 గంటల కరెంట్‌తోనే వ్యవసాయం..



గూడూరు: బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే మా బతుకులు బాగున్నాయి. 24గంటల కరెంట్‌తోనే పంటలు బాగా పండించుకుంటున్నాం. గత ప్రభుత్వాల హయాంలో కరెంట్ కోసం ఎదురు చూసిచూసి చేసేదేమీ లేక సబ్‌స్టేషన్‌ల వద్ద కూడా ఆందోళన చేసినం. మా బతుకులు ఇట్లనే ఉంటాయేమోనని, భూమి ఉన్నా నీరులేక పంటలు పండడ నా కుంటుంబానికి ఎవరు దిక్కు ఉంటారని రంది పడేవాన్ని. దేవుడి దయవల్ల, కేసీఆర్ సారు దీక్ష వలన రాష్ట్రం వచ్చింది. ఆ రోజు నుంచి మా బతుకుల మీద ఆశకలిగి 24గంటల కరంట్‌తో మా జీవితాల్లో వెలుగులు నిండాయి. సమృద్ధిగా పంటలు పండించుకుంటున్నాం. 3గంటల కరెంట్, 10 హెపీ మోటర్లు అంటే ఎవ్వరు ఒప్పుకుంటారు. వాళ్లకు ఓటుతోనే బుద్ధి చెబుతాం.

*–వాంకుడోత్ గాంధీ, రైతు, కలకత్తా తండా*

## ధరణితో భూములకు భద్రత ఏర్పడింది



మహబూబాబాద్ రూరల్ : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ధరణి తీసుకొచ్చి రైతుల భూములకు భద్రత కల్పించింది. ధరణి వల్లే భూములకు రేట్లు పెరిగినయి. కాంగ్రెసోళ్లు ధరణిపైన ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతుండ్రు. ప్రజలు వారి మాటలు నమ్మితే మోసపోతరు. ధరణి రాక ముందు కేవలం మాన్యువల్‌గా రికార్డ్ మాత్రమే ఉండేది. అందులో ఉన్న భూమిని వీఆర్వోలు రక రకాలుగా మార్చిండ్రు. ఇలా ఉండడంతో అనేక బాధలు పడ్డాం. కేసీఆర్ సాయ్ ధరణి తెచ్చిన తర్వాత భూములకు పూర్తి రక్షణ ఏర్పడింది. కేసీఆర్ ఆలోచన విధానం ఎంతో మంచిగా ఉంది. ధరణి పోతే రైతులు మళ్లీ ఆగమవుతరు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ కరెంట్ కష్టాలే.. ధరణి తీసుకొచ్చిన బీఆర్‌ఎస్‌ను కాపాడుకుంటాం.

*–డీ రామచంద్రు, రైతు, రేగడితండా*



# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- మహబూబాబాద్ నియోజకవర్గంలో 283 పోలింగ్ కేంద్రాలు
- మొత్తం 2,53,342 మంది ఓటర్లు
- ఎన్నికల సామగ్రితో సెంటర్లకు తరలి వెళ్లిన సిబ్బంది
- సమస్యాత్మక ప్రాంతాలపై పోలీసుల ప్రత్యేక దృష్టి
- బీఎస్‌ఎఫ్, పోలీసులతో బందోబస్తు



జిల్లా కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక

కేసముద్రం, నవంబర్ 29: అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మహబూబాబాద్ నియోజకవర్గంలో నేడు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో పోలింగ్ సెటర్లలో అధికారులు, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సౌకర్యాలు కల్పించారు. తాగు నీరు, విద్యుత్ సదుపాయం, ఓటర్లకు ఎండలో ఇబ్బంది కలుగకుండా టెంట్ వంటి ఏర్పాట్లు చేశారు. నియోజకవర్గ పరిధిలో 283 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వీటి పరిధిలో మొత్తం 2,53,342 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది ఎన్నికల సామగ్రితో తరలివెళ్లారు. గురువారం ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. ఒక్కో సెక్టార్‌కు ఒక అధికారిని నియమించారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ఒక ప్రిసైడింగ్ అధికారి, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ముగ్గురు సిబ్బంది ఉంటారు. వీటితో పాటు మైక్రో అబ్జర్వర్, వీడియోగ్రాఫర్ ఇద్దరిలో ఒకరు ఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. కేసముద్రం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌లో మామిడి ఆకులు, పూలతో తోరణం కట్టి సుందరంగా అలంకరించారు.

### గార్లలో 31 పోలింగ్ కేంద్రాలు

గార్ల: మండలంలో 31 పోలింగ్ కేంద్రాల్లో 29,745 ఓట్లు ఉన్నారు. ఎన్నికల కేంద్రాల్లో వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు అధికారులు తెలిపారు.



కేసముద్రం: పోలింగ్ కేంద్రాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరిస్తున్న సిబ్బంది

### బయ్యారంలో 43 పోలింగ్ సెంటర్లు

బయ్యారం: మండలంలో 36,985 మంది ఓటర్లుండగా 18,220 మంది పురుషులు, 18,764 మంది స్త్రీలు, ఒకరు ఇతరులు ఉన్నారు. 33 కేంద్రాల్లో 43 పోలింగ్ సెంటర్లను ఏర్పాటు చేశారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో పోలీసులు పటిష్ట బందోబస్త్ ఏర్పాటు చేశారు.

ఉదయం 6 నుంచి 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నది. మొట్లతిమ్మాపురం, గంధంపల్లి, కొత్తపేట, ఉప్పలపాడు, లక్ష్మీనర్సింహపురం, బాలజీపేట, గొల్లగూడెం సమస్యాత్మక గ్రామాలు కాగా, గార్ల, బయ్యారం సీఐ బాబు రావు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



బయ్యారం: పోలింగ్ సెంటర్ వద్ద బ్యానర్లు కడుతున్న సిబ్బంది

నెల్లికుదురు: అసెంబ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 39,211 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు 44 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓటర్ల సౌకర్యార్థం అన్ని కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. మొత్తం 180 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నారని, ఉదయం 5:30 నుంచి 7 గంటల వరకు మాక్ పోలింగ్ ఉంటుందని, ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.



బయ్యారం: పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

## ఓటరు స్లిప్‌లు అందని వారు హెల్ప్‌లైన్ ద్వారా చూసుకోవాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శశాంక**

మహబూబాబాద్, నవంబరు 29: ఓటరు సమాచార స్లిప్‌లు అందని వారు ఓటర్ హెల్ప్‌లైన్ ద్వారా చూసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కే శశాంక బుధవారం తెలిపారు. ఓటరు ఫొటో గుర్తింపు కార్డు (ఎపిక్)లేని వారు ప్రభుత్వం ద్వారా లభించిన ఆధార్ కార్డు, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ జాబ్ కార్డు, బ్యాంక్ పాస్ పుస్తకం, కార్మిక శాఖ వారు జారీ చేసిన ఆరోగ్య బీమా కార్డు పాన్ కార్డు, ఆర్‌బీఐ జారీ చేసిన స్మార్టు కార్డు, పాస్‌పోర్టు, పెన్షన్ ధ్రువీకరణ పత్రం, ఉద్యోగులకు జారీ చేసే పబ్లిక్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగుల గుర్తింపు కార్డు, పార్లమెంట్, శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు జారీ చేసే కార్డు, దివ్యాంగులకు జారీ చేసిన కార్డులలో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.

## ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

- ఎన్నికల బందోబస్తుకు 120 మంది సిబ్బంది
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 24 మంది బీఎస్‌ఎఫ్ ఫోర్స్
- ఎస్సై క్రాంతి కిరణ్

నెల్లికుదురు, నవంబర్ 29: నేడు అసెంబ్లీ ఎన్నికల నిర్వహణ బందోబస్తులో 120 మంది సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు నెల్లికుదురు ఎస్సై కే క్రాంతి కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా 55 కేంద్రాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా, పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు 55 మంది ఛత్తీస్‌గఢ్ హోంగార్డులు, 24 మంది బీఎస్‌ఎఫ్ సిబ్బంది, 20 మంది నెల్లికుదురు పోలీస్ స్టేషన్ సిబ్బంది బందోబస్తులో విధుల్లో ఉంటారన్నారు. మండలంలోని ఎర్రబెల్లిగూడెం, నైనాల, వావిలాల, మేచరాజుపల్లి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ఒక్కో పోలింగ్ కేంద్రానికి ఆరుగురు చొప్పున 24 మంది ప్రత్యేక బీఎస్‌ఎఫ్ సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని కేంద్రాల్లో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించేందుకు సీఐ, ముగ్గురు కానిస్టేబుళ్లతో స్ట్రైకింగ్ ఫోర్స్ బృందం పర్యవేక్షణ ఉంటుందన్నారు. మండలంలో బందోబస్తును ఒక సీఐ, ముగ్గురు ఎస్సైలు, 20మంది పోలీసులతో ప్రత్యేక బృందం ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## విద్యుత్ షాక్‌తో గేదె మృతి



గేదె కళేబరం వద్ద విలపిస్తున్న రైతు

దంతాలపల్లి, నవంబర్ 29: విద్యుత్ షాక్‌తో గేదె మృతి చెందిన ఘటన మండలంలోని రామవరం గ్రామంలో బుధవారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధూద యాకయ్య గేదె మేత కోసం వెళ్లింది. ఎల్‌టీ లైన్ విద్యుత్ తీగ గేదుకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.65వేలు ఉంటుందని, యాకయ్య కుటుంబ సభ్యులు బోరున విలపించారు.





గార్ల: ఎన్నికల సామగ్రి తీసుకుంటున్న అధికారులు, సిబ్బంది